

'గులాబీ' ఎమ్మెల్సీలపై.. కాంగ్రెస్ నజర్!

- శాసనమండలిలో బలం కోసం అధిష్ఠానం వ్యూహాలు
- ఓరుగల్లు నేతలతో హస్తం పార్టీ ముఖ్యనేతల మంతనాలు
- డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లిలకు గాలం?
- ఇప్పటికే వరుస ఓటములతో నిస్పృహలో బీఆర్ఎస్ నాయకులు
- కాంగ్రెస్‌లో చేరికకు ఇప్పటికే కొందరి సుముఖత

ఉమ్మడి వరంగల్ ఎమ్మెల్సీలే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కీలకమైన బిల్లుల ఆమోదానికి శాసనమండలిలో మెజార్టీ అవసరమున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నజర్.. ఓరుగల్లు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై పడింది. ప్రస్తుతం కాంగ్రెస్‌కు ఉన్న ఎమ్మెల్సీలతో మండలిలో నెగ్గుక రావటం అసాధ్యం కావడం.. గులాబీ పార్టీకి ఉన్న బలంతో కీలకమైన బిల్లులను మండలిలో అడ్డుకునే అవకాశం ఉండటంతో మండలిలో పైచెయ్యి సాధించేందుకు కాంగ్రెస్ నెంబరు గేమ్ స్టార్ట్ చేసింది. అందులో భాగంగా తొలుత ఓరుగల్లు ఎమ్మెల్సీను హస్తం గూటికి చేర్చుకునేందుకు వ్యూహ రచన చేస్తున్నట్లుగా సమాచారం. ఇప్పటికే శాసనసభ, లోక్‌సభ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస ఓటమిలతో గులాబీ ఎమ్మెల్సీలు నిస్పృహలో ఉన్నట్టు గుర్తించిన కాంగ్రెస్ ఎమ్మెల్సీలను ఆకర్షించేందుకు కసరత్తు ప్రారంభించింది. కీలక నేతలను కాంగ్రెస్ రంగంలోకి దించి.. చర్చలు జరుపుతున్నట్టు జరుగుతున్న ప్రచారం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది.

మండలి కోసం కాంగ్రెస్ నెంబర్ గేమ్

శాసనసభలో కాంగ్రెస్‌కు మెజార్టీ ఉంది. ఇటీవల కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించటంతో ఆ పార్టీ బలం 65కు పెరిగింది. సీపీఐకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే మద్దతు కూడా కాంగ్రెస్‌కే ఉంది. అయితే ఎటొచ్చి మండలిలోనే కాంగ్రెస్ బలహీనంగా ఉంది. మండలిలో కాంగ్రెస్‌కు కేవలం ఐదుగురే ఎమ్మెల్సీలున్నారు. దీంతో మండలిలో బలం పెంచుకునేందుకు ఆపరేషన్ ఆకర్ష్‌కు పదను పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది. తొలుత ఆరుగురు ఎమ్మెల్సీలు ఉన్న ఉమ్మడి వరంగల్ నుంచి నలుగురిని హస్తం గూటికి ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. గులాబీ ఎమ్మెల్సీలతో చర్చలు జరిపే బాధ్యతను ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరికి బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. దీంతో అంతర్గతంగా రంగంలోకి దిగిన ఇరువురు నేతలు ఎమ్మెల్సీలతో చర్చలు జరుపుతున్నట్లుగా తెలిసింది. ఉమ్మడి వరంగల్ నుంచి మొత్తం ఆరుగురు ఎమ్మెల్సీలు ఉండగా, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మినహ మిగతా నలుగురు ఎమ్మెల్సీలను పార్టీలో చేర్చుకోవాలనే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు కదుపుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

పాత కాంగ్రెస్ నేతలకు గాలం..

గతంలో కాంగ్రెస్‌లో కీలకంగా పని చేసిన ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను టార్గెట్‌గా వ్యూహరచన చేసినట్లుగా సమాచారం. అందులో భాగంగా గతంలో కాంగ్రెస్‌లో మంత్రిగా పని చేసిన వరంగల్‌కు చెందిన బస్వరాజు సారయ్యను కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చేందుకు ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి కుటుంబ సభ్యులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిగా రఘురామిరెడ్డి పేరు ఖరారు కాగానే, సారయ్య ఖమ్మం వెళ్లి రామసహాయం కుటుంబాన్ని కలిసి వచ్చారు. మర్యాదపూర్వకంగానే కలిసినట్లుగా అప్పట్లో సారయ్య వివరణ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో మారిన రాజకీయాలతో పాటు రామసహాయం కుటుంబంతో ఉన్న సత్సంబధాలతో మూలంగా సారయ్య కాంగ్రెస్‌లోకి వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయనే చర్చ జరుగుతోంది. వరంగల్ మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి శిష్యుడిగా సారయ్య రాజకీయాల్లో రాణించారు. మళ్లీ రామసహాయం కుటుంబం కాంగ్రెస్‌లో కీలకంగా మారటంతో బస్వరాజు సారయ్య చూపు కూడా కాంగ్రెస్ వైపు మళ్లిందనే చర్చ జరుగుతోంది. 2026 నవంబరు31వ తేదీన సారయ్య ఎమ్మెల్సీ పదవికాలం పూర్తి కానుంది. అయితే మరోసారి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తామనే హమీతో సారయ్యను పార్టీలోకి చేర్చుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. అలాగే మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఉన్న బండా ప్రకాష్ చూపు సైతం కాంగ్రెస్ వైపే ఉందనే చర్చ జరుగుతోంది. సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో ఉన్న బండా ప్రకాష్ 2017లో టీఆర్ఎస్‌లో చేరారు. 2018లో బండా ప్రకాష్‌ను టీఆర్ఎస్ రాజ్యసభకు పంపించింది. ఆ తరువాత 2021లో ఈటల రాజేందర్ బీజేపీలో చేరటంతో అదే సామాజిక వర్గానికి చెందిన బండా ప్రకాష్‌ను 2021 డిసెంబరు 1న ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీగా శాసనమండలికి పంపించి, డిప్యూటీ చైర్మన్ చేశారు. 2027 నవంబరు 30వ తేదీ వరకు ప్రకాష్‌కు పదవికాలం ఉంది. అయితే 1980 నుంచి 2017 వరకు మూడున్నర దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌తో బండా ప్రకాష్‌కు రాజకీయ అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో ప్రకాష్‌ను తిరిగి కాంగ్రెస్‌లోకి తీసుకవచ్చేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. బండా ప్రకాష్, బస్వరాజు సారయ్య ఇద్దరు కూడా పాత కాంగ్రెస్ నేతలే కావటంతో వీరు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరుతారనే చర్చ రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది.

గులాబీ ఎమ్మెల్సీలపై గురి

శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన నేతల్లో ఒకరైనా ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావులపై కాంగ్రెస్ నేతలు గురి పెట్టినట్టు సమాచారం. మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 30వ తేదీతో పూర్తి కానుంది. దీంతో మళ్లీ ఎమ్మెల్సీ పదవి రెన్యువల్ హమీతో సత్యవతిరాథోడ్‌ను కాంగ్రెస్‌లోకి తీసుకొచ్చేందుకు నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. గతంలో టీడీపీ, బీఆర్ఎస్‌లో పని చేసిన సందర్భంలో సత్యవతిరాథోడ్‌తో స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియంకి సత్సంబధాలున్నాయి. ఈ నేపథ్యంలో సత్యవతితో చర్చలు జరిపే బాధ్యతను కడియం శ్రీహరిపై పెట్టినట్టు సమాచారం. దీంతో పాటు ఎమ్మెల్సీ రవీందర్‌రావును కూడా హస్తం గూటికి తీసుకవచ్చేందుకు చర్చలు జరుపుతున్నట్టు తెలిసింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిపై రవీందర్‌రావు సంచలన వాఖ్యాలు చేశారు.

ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ లాంటి వారికి మంత్రి పదవులు ఇవ్వటం మూలంగానే ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారని వాఖ్యానించడం సంచల నంగా మారింది. దీంతో రవీందర్‌రావును కాంగ్రెస్ గూటికి తీసుకవస్తే పార్టీకి మరింతా బలం పెరుగుతుందనే చర్చ ఆ పార్టీలో జరుగుతుంది. ఇప్పటికే ఒకరిద్దరు ఎమ్మెల్సీలతో అంతర్గతంగా చర్చలు పూర్తి అయినట్లుగా సమాచారం.

పార్టీలో ప్రాధాన్యత ఇవ్వటంతో పాటు భవిష్యత్తులో మంచి అవకాశాలు కల్పిస్తామని హమీ ఇవ్వటంతో హస్తం గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లుగా సమాచారం. మొత్తానికి కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌కు ఎంతమంది ఎమ్మెల్సీలు చిక్కుతారోననేదానిపై ఓరుగల్లు రాజకీయాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



- జిల్లా వ్యాప్తంగా ఘనంగా వేడుకలు
- ఈద్గాల్లో ప్రార్థనలు చేసిన ముస్లింలు
- ఖురాన్ బోధించిన మతపెద్దలు



వెంకటాపురం(నూగూరు)లో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

వివరాలు 7, 8వ పేజీల్లో

చిన్నారిని హత్యచేసిన నిందితుడికి మరణశిక్ష విధించాలి



అంబేద్కర్ విగ్రహం వద్ద చిన్నారికి నివాళులర్పిస్తున్న బంజారానాయకులు

ములుగు, జూన్ 17: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో ఆరేళ్ల చిన్నారిని హత్యచేసిన నిందితునికి మరణ శిక్ష విధించాలని బంజారా నాయకులు డిమాండ్ చేశారు. చిన్నారి మృతికి సంతాపంగా సోమవారం రాత్రి ములుగులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం ఎదుట నివాళులర్పించారు. అభంశుభం తెలియని పసిపాపపై అఘాయిత్యం చేసి ప్రాణాలు తీసిన సంఘటన ప్రతీ ఒక్కరిని కలిచివేసిందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే కఠినమైన చట్టాలు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో బంజారా నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆది మానవుల సమాధుల సందర్శన



ఆదిమానవుల సమాధుల వద్ద సందర్శకులు

తాడ్వాయి, జూన్ 17: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దామెరవాయి అడవుల్లో ఉన్న ఆది మానవుల సమాధులను సోమవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, పెద్దపల్లి జిల్లాలకు చెంది న సందర్శకులు పరిశీలించారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు పరకాల కోటిలింగం, కళావతి ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు, బంధువులు సుమారు 30మంది సమాధులను సందర్శించి పరిశీలించారు. అనంతరం గౌరారంవాగులో ఆటలాడుకొని తిరుగు పయనమయ్యారు.

సింగరేణి అధికారులతో జీఎం సమీక్ష



మాట్లాడుతున్న జీఎం హబీబ్ హుస్సేన్

కాకతీయఖని, జూన్ 17: సింగరేణి భూపాలపల్లి ఏరియా అధికారులతో జీఎం హబీబ్ హుస్సేన్ సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో ప్రారంభం కానున్న ఈపీ ఆపరేటర్ల ట్రైనీ ప్రాక్టికల్ పరీక్షకు కావాల్సిన ఏర్పాట్లను సక్రమంగా చూడాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా చూడాలని అన్నారు. రెండు రోజులపాటు జరగనున్న ఎంపిక పరీక్షకు హాజరయ్యే ఉద్యోగులకు సరైన సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ ఎంపిక పరీక్ష పూర్తి పారదర్శంగా నిర్వహిస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని ఉద్యోగులకు సూచించారు. స్థానిక జీఎం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, జ్యోతి, తుకారాం, రవికుమార్, పద్మజ, రాజుయాదవ్, క్రాంతి కుమార్, శ్యామ్‌ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్రలు వచ్చేశాయ్..



కాటారం, జూన్ 17: ముట్టుకుంటే ముడుచుకుపోయేతత్వం.. పట్టు లాంటి చర్మం.. ముదురు ఎరుపు రంగు.. వర్షాకాలం ఆరంభంలో మాత్రమే కనిపించే ఆరుద్ర పురుగులు చేలల్లో సందడి చేస్తున్నాయి. అన్నదాతల అతిథులైన వీటిని రైతులు పవిత్రంగా భావిస్తారు. ఆరుద్ర పురుగులు ఎంత ఎక్కువగా కనిపిస్తే వర్షాలు అంత ఎక్కువగా కురుస్తాయ్..అనే మాటను పెద్దలు చెప్తుంటారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో ఆరుద్రలు బయటకు వచ్చాయి. ఆరుద్ర కార్తెలో ఇవి ఎక్కడబడితే అక్కడ పుష్కలంగా కనిపిస్తా యి.. ఆరుద్ర కార్తెకు వారం ముందే మండలంలోని రేగులగూడెం, దేవరా ంపల్లి సమీపంలోని చేలల్లో ఆరుద్ర పురుగులు సందడి చేశాయి.

హక్కు పత్రాలు అందించి ఇళ్లు కేటాయించాలి



అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న గండ్ర జ్యోతి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి
- భూపాలపల్లిలో మహాధర్నా

భూపాలపల్లిటౌన్, జూన్ 17: డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు హక్కుపత్రాలు అందించి ఇళ్లు కేటాయించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో డబుల్‌బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులతో సోమవారం మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో పేద కుటుంబాలకు నీడ కల్పించాలనే లక్ష్యంతో భూపాలపల్లిలో 996 డబుల్‌బెడ్ రూం ఇళ్లను నిర్మించడం జరిగిందని అన్నారు. దీనికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మొదటి విడతగా సుమారు 540 మంది లబ్ధిదారులకు డ్రా పద్ధతిలో అర్హులైన వారికి మీడియా సమక్షంలో ఇళ్లను కేటాయించడం జరిగిందని అన్నారు. అలాగే రెండో విడతలో 393 ఇళ్లను కేటాయించినట్లు తెలిపారు. కాగా భాస్కర్ గడ్డలో గల ఇళ్లకు ఎనిమిది నెలలు గడుస్తున్నా.. హక్కు పత్రాలు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ క్రమంలో పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా వెంటనే హక్కు పత్రాలు అందించి వారికి ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేదలకు వెంటనే ఇళ్లను అందించాలన్నారు. అనంతరం సీఐ నరేష్ అక్కడికి చేరుకుని వచ్చే నెల 3వ తేదీ వరకు లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్, నాయకు లు నాగుల దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రోడ్డు విస్తరణ పనులు!

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రెండు వైపులా చేస్తున్న రోడ్డు విస్తరణ పనులు

కాటారం, జూన్ 17: కాటారం-మంథని ప్రధాన రహదారిపై రోడ్డు విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వేసవిలో పనులు ప్రారంభించి వానాకాలం ఆరంభం నాటికి పూర్తి చేయాల్సి ఉండగా కాంట్రాక్ట్ నిర్వాహకులు పనులను ఆలస్యంగా మొదలెట్టారు. విస్తరణ పనులను రోడ్డుకు ఓ వైపు మొదలెట్టి పూర్తయిన అనంతరం మరోవైపు చేయాల్సి ఉండగా రోడ్డంతా తవ్వి పనులు చేస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్చరిక బోర్డులు, రోడ్డు తవ్విన చోట రేడియం స్టిక్కర్లు సరిగ్గా పెట్టలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డును తవ్వి మొరం పోసి సరిగా రోలింగ్, నీరు స్ప్రేయింగ్ చేయక దుమ్ము లేసి ద్విచక్రవాహనదారుల కళ్లల్లో దుమ్ము కొడుతోంది. గుంతల్లో వాహనాలు ఎగిరెగిరి పడుతున్నాయి. చిన్నపాటి వర్షానికి మట్టిమొరంలో లారీలు, టిప్పర్లు దిగబడిపోయి పలుమార్లు ట్రాఫిక్ జామ్ అయింది. భారీ వర్షాలు కురిస్తే గంటలపాటు ఇబ్బందులు తప్పవని వాహనదారులు హెచ్చరిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షణ చేసి పనులు సక్రమంగా చేయించాల్సి ఉండగా పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు నాణ్యతతో సక్రమంగా త్వరగా పూర్తయ్యేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని, రవాణా సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సీఈఆర్ క్లబ్‌కు మోక్షం ఎప్పుడో..?

క్రీడాకారులకు తప్పని ఎదురు చూపులు

కాకతీయఖని, జూన్ 17: సింగరేణి కార్మికుల మానసికోల్లాసానికి కోట్లు వెచ్చించి పలు రకాల క్రీడలు ఇండోర్‌లో ఆడుకోవడానికి సింగరేణి యాజమాన్యం కంపెనీ వ్యాప్తంగా కాలరీస్ ఎంప్లాయిస్ రిక్రియేషన్ (సీఈఆర్) క్లబ్‌లను ఏర్పాటు చేసింది. అయితే భూపాలపల్లి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌ను ప్రభుత్వ అధికారులు ఎన్నికల సమయంలో ఆధీనంలోకి తీసుకోవడంతో క్రీడాకారులకు అందుబాటులో లేకుండా పోయింది. ఎన్నికలు ముగిసినప్పటికీ వారు తిరిగి అప్పగించకపోవడంతో కార్మికులు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సింగరేణి ఉద్యోగులు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని కార్మికులు చెబుతున్నారు. అయితే సీఈఆర్ క్లబ్‌లో క్యారమ్స్, టేబుల్‌టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్, జిమ్‌తో పాటు వివిధ వృత్తి శిక్షణ తరగతులను నేర్పించే గదులు కూడా ఉన్నాయి. కానీ వీటిని గత సంవత్సర కాలంగా మూసివేశారు. కారణం ఏమిటంటే.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వానికి ఎక్కడా స్థలం లేదన్నట్లు ఈ సీఈఆర్ క్లబ్‌నే ఎంచుకున్నారు. ఇక్కడ ఈవీఎం మిషన్లు పెట్టేందుకు గాను అనువుగా ఉంటుందని, సెక్యూరిటీకి అనువైన స్థలం అని దీనినే ఎంపిక చేసినట్లు సమాచారం. కానీ దానిని ఏళ్ల తరబడి తెరుచుకోకుండా ఉంచడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సీఈఆర్ క్లబ్ నిర్వహణకు తాము నెలకు రూ.10చొప్పున చెల్లిస్తున్నామని, తమ సంక్షేమ నిధి నుంచి జరిగే నిర్వహణకు ప్రభుత్వం ఆటంకం కలిగించడం దారుణమని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే భూపాలపల్లి ఏరియా నుంచి వివిధ క్రీడల్లో కోల్‌ఇండియా స్థాయిలో బంగారు పతకాలు సాధించిన వారు కూడా సరైన సాధన చేయకపోవడం మూలంగా వారు వెనుకబాటుకు గురవుతున్నారని విమర్శలు ఉన్నాయి. కాగా ఇప్పటికైనా వెంటనే సీఈఆర్ క్లబ్‌ను ఖాళీ చేసి క్రీడాకారులకు అందజేయాలని కోరుతున్నారు.

అడవి జంతువు మాంసం స్వాధీనం

వాహనం సీజ్



అటవీశాఖ అధికారులు సీజ్ చేసిన వాహనం

ఏటూరునాగారం, జూన్ 17 : అటవీ జంతువు మాంసాన్ని పట్టుకొని, కారును స్వాధీనం చేసుకున్న ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అటవీశాఖ రేంజ్ అధికారి బాలాజీ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రాంపూర్ గ్రామ సమీపంలో గత 4 రోజుల క్రితం కారులో అటవీ జంతువు మాంసం తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు తమ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నామన్నారు. కాగా, కొందరూ కారులో ఓ అటవీ జంతువు మాంసాన్ని తరలిస్తున్నట్లుగా గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకోవాడానికి ప్రయత్నిస్తుండగానే నిందితులు అటవీశాఖ అధికారులను చూసి కారును అక్కడే వదిలేసి పరారయ్యారని ఆయన తెలిపారు. కాగా, కారులో మూడు ప్యాకెట్లలో ప్యాక్ చేసి ఉన్న సుమారు 3 కేజీల మాంసాన్ని స్వాధీనం చేసుకొని, కారును ఏటూరునాగారంలోని అటవీశాఖ కార్యాలయానికి తరలించి సీజ్ చేశామన్నారు. కాగా, మాంసాన్ని టెస్ట్ కోసం ల్యాబ్ రిపోర్టుకు పంపామన్నారు. ఈ విషయంపై విచారణ చేపడుతున్నట్లు బాలాజీ తెలిపారు.

అనుమతి లేకుండా చెట్టు నరికివేత

రోడ్డుకు అడ్డుగా వేయడంతో స్థానికుల ఆందోళన



హనుమకొండ రెడ్డికాలనీ మోరల్ స్కూల్ పక్కన రోడ్డుకు అడ్డుగా వేసిన చెట్టు, రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహనదారులు

హనుమకొండ చౌరస్తా, జూన్ 17 : పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలను నిర్వహిస్తూ.. మొక్కలు నాటించి వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటుంటే.. దానికి విరుద్ధంగా హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీకి చెందిన ఓ వ్యక్తి రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పచ్చని చెట్టును ఎలాంటి అనుమతులు లేకుండా నరికేశాడు. అంతటితో ఆగకుండా నరికిన ఆ చెట్టును రోడ్డుకు అడ్డంగా వేశాడు. ఈ సంఘటన తీవ్ర చర్చనీయాంశమైంది. హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీ మోరల్ స్కూల్ పక్కన అదే ప్రాంతానికి చెందిన ఎ. సదానందం అనే వ్యక్తి తన ఇంటి ఎదుట, రోడ్డు పక్కన కొన్నేళ్లుగా ఏపుగా పెరిగిన చెట్టును ఆదివారం రాత్రి ఎలాంటి అనుమతులు లేకుండానే నరికి రోడ్డుకు అడ్డుగా వేశాడు. దీంతో ఆందోళనకు దిగిన స్థానికులు చెట్టును ఎందుకు నరికారంటూ నిలదీయగా తానెవరికీ చెప్పాల్సిన అవసరం లేదని, మునిసిపల్ సిబ్బంది వచ్చి తీసుకపోతారని దురుసుగా సమాధానమిచ్చాడని వాపోయారు. చెట్టును నరికిన ఆయనపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

కాజీపేట, జూన్ 17 : ఓ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట మండలం భట్టుపల్లికి చెందిన రాజారపు ఉమేశ్ అనే వ్యక్తి రహ్మత్‌నగర్‌కు చెందిన ఓ బాలికను ఈ నెల 6న బైక్‌పై తీసుకెళ్లాడు. దీంతో బాలిక బంధువులు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 15న బాలికను పట్టుకున్న పోలీసులు బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజారపు ఉమేశ్ తనను ప్రేమ పేరుతో వేధిస్తూ వెంటపడుతున్నాడని పేర్కొంది. గతేడాది తనను హైదరాబాద్‌కు తీసుకెళ్లి అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సోమవారం భట్టుపల్లిలో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.


మహబూబాబాద్ జిల్లా గార్ల ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


ములుగు జిల్లా ఏటూరునాగారంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం పెద్దలు


జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

ఈద్గాల్లో ముస్లింల ప్రార్థనలు.. పాల్గొన్న ప్రముఖులు

మానవాళికి త్యాగ సందేశాన్ని అందించే బక్రీద్ పండుగను సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముస్లింలు ఉదయం నుంచే ఈద్గాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఖురాన్‌లోని ఈమామ్‌ను అనుసరిస్తూ కుద్బా పేరిట ప్రత్యేక నమాజ్‌లు చేశారు. హనుమకొండ, వరంగల్, కాజీపేటల్లోని ప్రముఖ ఈద్గాలతో పాటు ఉమ్మడిజిల్లాలోని ఈద్గాల్లో జరిగిన ప్రార్థనలకు పలువురు ప్రముఖులు, ప్రజాప్రతనిధులు హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రార్థనల అనంతరం కుర్బానీ పేరిట బలిదానాలు చేసిన మేకలను సమీప బంధువులకు, నిరుపేదలకు పంచగా ముస్లింమేతరులు కూడా కుర్బానీని స్వీకరించి ఐకమత్య భావనను చాటారు.


హనుమకొండలోని పెద్దమ్మగడ్డ ఈద్గాలో నమాజ్, ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు


వరంగల్‌లోని ఫోర్ట్‌రోడ్ ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


జనగామ జిల్లా నర్మెటలో ఈద్గా వద్ద ముస్లింల ప్రార్థనలు

‘ఫుడ్ ప్రాసెసింగ్’ల జాడేదీ?

నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటుకు గత సర్కారు నిర్ణయం

- మూడేళ్లుగా కాగితాలకే పరిమితమైన పార్కులు
- స్థలాల గుర్తింపుతోనే సరిపెట్టిన వైనం
- అందుబాటులోకి తెస్తే వేలాది మందికి ఉపాధి

జనగామ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. 2021లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటగా జిల్లాకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించగా ఆ తర్వాత నియోజకవర్గానికి ఒకటి చొప్పున నెలకొల్పాలని భావించింది. వాటి ద్వారా స్థానికంగా యువతకు ఉపాధి దొరుకుతుందని, పార్కులను అభివృద్ధి చేసి స్థానికంగా ఆసక్తి ఉన్న వారికి కేటాయిస్తే ఆహార శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయించే ఆస్కారం ఉంటుందని అప్పటి ప్రభుత్వం ఉద్దేశం. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను సైతం గుర్తించి కలెక్టర్ల ద్వారా ప్రతిపాదనలు తెప్పించుకుంది. కాని మూడేళ్ల పాటు ఈ విషయంలో ఎలాంటి ముందడుగు వేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం కొన్ని చోట్ల మాత్రమే తూతూమంత్రంగా పార్కులను నెలకొల్పగా చాలా చోట్ల పట్టించుకోలేదు.

స్థల పరిశీలనతోనే సరి

ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటు కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థల పరిశీలనతోనే సరిపెట్టింది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేస్తామంటూ గొప్పగా చెప్పి అమలులో మాత్రం శ్రద్ధ కనబరచలేదు. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని చోట్ల మాత్రమే తూతూమంత్రంగా పార్కులను అభివృద్ధి చేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర, జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మన్‌పహాడ్ గ్రామాల్లో మెగా ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను ఏర్పాటు చేయాలని మొదటగా భావించింది. ఇందు కోసం అధికారులు వంగరలో 141 ఎకరాలు, మన్‌పహాడ్‌లో 145 ఎకరాల స్థలాన్ని గుర్తించి ప్రతిపాదనలు పంపారు. అంతేగాకుండా జనగామ జిల్లా తరిగొప్పులలో 75 ఎకరాలు, చిలుపూర్ మండలం నష్కల్‌లో 75 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. అదేవిధంగా ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల కోసం స్థల పరిశీలన చేశారు. కాగా.. ఇందులో కేవలం వంగరలో మాత్రమే పార్కును అభివృద్ధి చేసి మిగతా చోట్ల విస్మరించారు.

కాగితాల్లోనే పార్కులు

రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటు కేవలం కాగితాలకే పరిమితమైంది. అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల్లో రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద స్థలాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన సంస్థ(టీఎస్ఐఐసీ)కి బదలాయించారు. టీఎస్ఐఐసీ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. ఆ తర్వాత అటు టీఎస్ఐఐసీ అధికారులు గానీ, ఇటు ప్రజాప్రతినిధులు గానీ ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల అంశాన్ని పూర్తిగా విస్మరించారు. దీంతో పార్కుల ఏర్పాటు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది.


జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మన్‌పహాడ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుకు కేటాయించిన స్థలం

వేలాది మందికి ఉపాధి..

ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా జిల్లాల్లో స్థానికంగా యువతకు, కూలీలకు ఉపాధి దొరికే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గుర్తించిన స్థలాల్లో టీఎస్ఐఐసీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అనుగుణంగా ప్లాంట్లను తయారు చేస్తుంది. వీటిని ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు కేటాయిస్తుంది. దీంతో అటు యూనిట్లు నెలకొల్పిన వారితో పాటు అందులో పనిచేయడానికి అవసరమయ్యే కూలీలకు ఉపాధి దొరుకుతుంది. ఒక్కో ఫుడ్ ప్రాసెసింగ్ పార్కులో దాదాపుగా 3 వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పేర్కొంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వేయిస్తంభాల ఆలయానికి పోటెత్తిన భక్తులు


రుద్రేశ్వరుని దర్శనానికి బారులుదీరిన భక్తులు

హనుమకొండ కల్చరల్, జూన్ 17: నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. శివునికి ప్రీతికరమైన రోజు కావడం, మంగళవారం నిర్జల ఏకాదశి తిథి ఉండటంతో భక్తులు ముందురోజైన సోమవారం అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని అభిషేకాలు చేశారు. సుమారు వందమంది దంపతులు సామూహిక రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఈవో వెంకటయ్య పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శీఘ్ర దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఇటీవల కాలంలో కల్యాణ మండప పనులు పూర్తయిన నేపథ్యంలో సంపూర్ణ ఆలయాన్ని సందర్శించేందుకు భక్తుల రద్దీ ఎక్కువ కావడం గమనార్హం.

సీతక్క కాన్వాయ్‌లోకి ల్యాండ్ క్రూయిజర్

- వాహనానికి గట్టమ్మ దేవాలయం వద్ద పూజలు

ములుగు కలెక్టరేట్, జూన్ 17: మంత్రి ధనసరి సీతక్క కాన్వాయ్‌లోకి కొత్త వాహనం చేరింది. గత ప్రభుత్వ హయాంలో కొనుగోలు చేసిన ఈ బుల్లెట్ ప్రూఫ్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ల్యాండ్ క్రూయిజర్ వాహనాలపై వివాదం మొదలైంది. ప్రభుత్వం మారిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వం వినియోగంలోకి తెచ్చింది. ఈ క్రమంలోనే రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క కాన్వాయ్‌కి ఓ వాహనాన్ని కేటాయించారు. దీంతో సోమవారం ఆమె ములుగులోని గట్టమ్మతల్లి దేవాలయం వద్ద ఆ వాహనానికి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత కుటుంబసభ్యులతో కలిసి గట్టమ్మ తల్లిని దర్శించుకున్న సీతక్క వాహన పూజలో పాల్గొన్నారు. ఆమెవెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్, తదితరులున్నారు.


వాహనానికి పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

మేడిగడ్డ బ్లాక్-7లో కొనసాగుతున్న మరమ్మతు పనులు

బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లోని ఇసుక నిల్వల తొలగింపునకు యత్నాలు


బ్యారేజీ వద్ద పేరుకుపోయిన ఇసుక (ఫైల్)

మహదేవపూర్ రూరల్, జూన్ 17 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కుంగిన మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-7లో తాత్కాలిక మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. బ్యారేజీ గేట్లు, పిల్లర్ల కిందున్న అగాధాన్ని పూడ్చేందుకు చేపట్టిన సిమెంట్, ఇసుక గ్రౌటింగ్ ప్రక్రియతో పాటు దిగువన షీట్‌ఫైల్స్ అమరిక, సీసీ బ్లాకుల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. బ్లాక్-7లో మొత్తం 11 గేట్లుండగా 10గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తగా ప్రభావం ఉన్న 20వ గేటు తొలగింపు పనులు కొనసాగు తున్నాయి. ఇటీవలే గేటు కటింగ్ పనులు పూర్తి చేసిన అధికారులు దాని విడిభాగాలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సలాం.. పోలీసన్న..

- గాయంతో ఠాణాకు వచ్చిన రైతును అక్కున చేర్చుకున్న హెడ్ పీసీ కృష్ణ
- బాధితుడికి పోలీస్‌స్టేషన్ మెడికల్ కిట్‌తో ప్రథమ చికిత్స
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం

నర్సింహులపేట, జూన్ 17 : వ్యవసాయ బావి వద్ద గెట్టు విషయంలో ఇరువురు రైతుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ రైతు తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా హెడ్ కానిస్టేబుల్ కృష్ణ అక్కున చేర్చుకొని మానవత్వం చాటుకున్నాడు. ఠాణాలో ఉన్న మెడికల్ కిట్‌తో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం వస్రాంతండాకు చెందిన జాటోతు పూల్‌సింగ్ వ్యవసాయ బావి వద్ద ఈనెల 15న అదే తండాకు చెందిన లూనావత్ సూర్యతో గెట్టు విషయంతో ఘర్షణ జరిగింది. మాటామాట పెరగడంతో సూర్య తన చేతిలో ఉన్న గడ్డపారతో దాడి చేయడంతో పూల్‌సింగ్ కాలుకు బలమైన గాయం ఏర్పడింది. తీవ్ర రక్తస్రావంతో నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుడిని చూసిన విధి నిర్వహణలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ బానోతు కృష్ణ చలించిపోయాడు. ఠాణాలో ఉన్న మెడికల్ కిట్‌తో ప్రథమ చికిత్స చేసి మానవత్వం చాటుకున్నాడు. కాలు గాయానికి కట్టుకట్టిన అనంతరం ఫిర్యాదు స్వీకరించి మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రధాన ఆస్పత్రికి పంపించారు. ఇది గమనించిన ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. ఎస్సై, పోలీసు సిబ్బంది హెడ్ పీసీ కృష్ణను అభినందించడం విశేషం. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడంతో మండల ప్రజలు శెభాష్. పోలీసన్న అని అభినందనలు తెలిపారు.

మా అబ్బాయి స్కూల్‌కు వెళ్లడం లేదు సార్..

సెంట్రల్ జైల్లో వేయండంటూ డయల్ 100కు ఫోన్ చేసిన తండ్రి



కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 17: ‘ సార్ మా అబ్బాయి మా మాట వినడం లేదు.. స్కూల్‌కు వెళ్లమంటే వెళ్లడం లేదు.. సెంట్రల్ జైల్లో వేయండి అక్కడైనా చదువుకుంటాడు’ అంటూ ఓ తండ్రి డయల్ 100కు ఫోన్ చేసిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం జరిగింది. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పుల్లూరురామయ్యపల్లికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి సోమవారం డయల్ 100కు సోమవారం ఫోన్ చేశాడు. తన 13 ఏళ్ల కుమారుడు స్కూల్‌కు వెళ్లడం లేదని, గతేడాది కొంపెల్లి స్కూలులో వేస్తే కేవలం రెండు నెలలే పోయాడని చెప్పుకొచ్చాడు. ఏలాగైనా స్కూలుకు పంపించేలా చూడాలని కోరాడు. అయితే, ఇలా ఓ వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి తన కుమారుడు మాట వినడం లేదని చెప్పడంతో నివ్వెరబోయిన పోలీసులు.. అత్యవసరాలకు వాడుకోవాల్సిన సర్వీసును ఇలా దుర్వినియోగం చేయడం సరికాదని శ్రీనివాస్‌ను సున్నితంగా మందలించారు. కాగా, ఎవరికి శాంతిభద్రతలు, రక్షణ సమస్య వచ్చినా బాధితులకు ముందుగా గుర్తొచ్చేది డయల్ 100 కాగా.. ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలోనే పోలీసులు వాలిపోయి సమస్యను తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపుతున్నారు. అలాంటి డయల్ 100కు ఇలాంటి ఫోన్‌కాల్ రావడంతో అందరూ ఆశ్చర్యపోయారు.

అన్ని విభాగాల్లోని ఖాళీ పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేయాలి

- రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగిన విద్యార్థులు


రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న పీహెచ్‌డీ ఆశావహులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 17: కాకతీయ యూనివర్సిటీలోని అన్ని విభాగాల్లో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేయాలని పీహెచ్‌డీ ఆశావహ విద్యార్థులు డిమాండ్ చేశారు. పీహెచ్‌డీ కేటగిరి-2 సీట్ల భర్తీపై విద్యార్థులు సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. కేటగిరీ-1 లో మిగిలిన సీట్లను కేటగిరి-2 కు బదలాయించి భర్తీ చేయాలన్నారు. అలాగే ప్రతీ డిపార్ట్‌మెంట్‌లో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న సీట్లను వెంటనే భర్తీ చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పీహెచ్‌డీ సీట్లను భర్తీ చేసిన మాజీ వీసీ తదితర అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారు రిజిస్ట్రార్‌కు ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లన్ని భర్తీ చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండి. పాష, ఎం. కుమార్, ఎం. భాస్కర్, ఎం. రాజు, ఎల్. రాజగోపాల్, బి. మనోహర్, ఎ. శంకర్, పి. జగదీష్, కె. తిరుపతి, బి. రాకేష్, గణేష్, శ్రీనాథ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

- కేయూ క్యాంపస్ : కేయూలో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్లన వెంటనే భర్తీ చేయాలని కేయూ స్టూడెంట్ యూనియన్ నేతలు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని తన చాంబర్‌లో కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా స్టూడెంట్స్ యూనియన్ నేతలు మాట్లాడుతూ.. పీహెచ్‌డీ కేటగిరి-1,2లో మిగిలిన సీట్లే కాకుండా ఇప్పటి వరకు ఖాళీ ఉన్న అన్ని సీట్లు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరణ ఆదేశాలతో తమకున్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మట్టెడ కుమార్, మంద భాస్కర్, మోతె రాజు, రాజగోపాల్, బొట్ల మనోహర్, అంకిళ్ళ శంకర్, పంజల జగదీశ్, కందికొండ తిరుపతి, బందిగా రాకేశ్, గణేశ్, శ్రీనాథ్, అజయ్ ,ఎమ్డీ పాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణికి దరఖాస్తుల వెల్లువ

- పట్టణాల్లో అత్యల్పం.. గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికం
- స్వీకరణ కేంద్రాలను సందర్శించిన సీఎండీ, డైరెక్టర్, సీజీఎం

హనుమకొండ టౌన్, జూన్ 17 : విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం ఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ కార్యాలయాల్లో ప్రజావాణి ఏర్పాటు చేయాలన్న సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలతో.. అధికారులు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. తొలిరోజే ప్రజల నుంచి మంచి ఆదరణ రాగా.. పట్టణాల్లో ఉండే సర్కిల్ కార్యాలయం, డివిజన్ ఆఫీస్, సబ్‌డివిజన్ ఆఫీస్‌లో దరఖాస్తులు తక్కువగా వచ్చినా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల నుంచి ఆయా ఏఈ కార్యాలయాలకు దరఖాస్తులు అధికంగానే అందాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల నుంచి ఓవర్‌లోడ్, అదనపు ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు, లెంతీలైన్లు కాకుండా మధ్యలో పోల్స్ ఏర్పాటు చేయడం తదితర అంశాలపై ఫిర్యాదు అందాయని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు. పట్టణాల్లో చెట్ల కొమ్మలు వైర్లపైకి రావడం, బిల్లింగ్ వంటి అంశాలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో డీఈ, ఈఆర్వో, ఏడీఈ, ఏఈ కార్యాలయాల్లో ఆయా అధికారులు సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దరఖాస్తులు స్వీకరించగా, మధ్యాహ్నం ఎస్ఈలు తమ చాంబర్లలో స్వయంగా బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగా, భీమదేవరపల్లి సబ్‌డివిజన్‌లోని ఎల్కతుర్తి సెక్షన్‌తో పాటు భీమదేవరపల్లి, పరకాలలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రాన్ని సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి సందర్శించి బాధితుల నుంచి స్వయంగా దరఖాస్తులను స్వీకించారు. హనుమకొండ టౌన్ డీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కౌంటర్‌ను ఆపరేషన్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ మోహన్‌రావు సందర్శించారు. అదే విధంగా వరంగల్ సర్కిల్ కార్యాలయంలోని కౌంటర్‌ను ఆపరేషన్స్ సీజీఎం కె.కిషన్ సందర్శించి పర్యవేక్షించారు. హనుమకొండ సర్కిల్‌లో మొత్తం 41 దరఖాస్తులు రాగా అత్యధికంగా ఎల్కతుర్తి సెక్షన్‌లో 19 దరఖాస్తులు వచ్చినట్లు హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ తెలిపారు. వరంగల్ సర్కిల్‌లో మొత్తం 26 దరఖాస్తులు వచ్చినట్లు ఎస్ఈ మధుసూదన్‌రావు తెలిపారు. డీఈలు జి. సాంబరెడ్డి, ఆనందం, ఏడీఈలు మల్లికార్జున్, అశోక్, ఏఈలు టెక్నికల్ ఏఈలు పాల్గొన్నారు.


వరంగల్ సర్కిల్ ఆఫీస్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎస్ఈ మధుసూదన్‌రావు


బాధితుడి నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న హనుమకొండ డీఈ సాంబరెడ్డి, పక్కన డైరెక్టర్ మోహన్‌రావు

భక్తి శ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు


మంగపేట ఈద్గాలో నమాజ్‌లో పాల్గొన్న ముస్లింలు


చిట్యాలలో నమాజ్ చేస్తున్న ముస్లింలు


కొయ్యూర్‌లో మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర

ములుగు కలెక్టరేట్ : బక్రీద్ వేడుకలు భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఘనంగా జరిగాయి. సోమవారం ఈద్గాలు, మసీదులలో సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేసి ఖురాన్ పఠించారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగం, సేవకు ప్రతీకగా భావించే బక్రీద్ పర్వదినాన పలువురు నిరుపేదలకు నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలను వితరణ చేశారు. రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియ జేశారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ములుగులో కాంగ్రెస్ మైనారిటీసెల్ నాయకులతో కలిసి బక్రీద్ వేడుకల్లో పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జడ్పీ కోఆప్షన్ మెంబర్ రియాజ్‌మీర్జా పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : మండలంలోని జమ్మా మసీద్‌లో ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ (ఈద్- ఉల్- జుహా) పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఆకులవారిఘ ణపురం ఈద్గా దగ్గర అల్లాకు ప్రత్యేక ప్రార్థనలు చేసి ముస్లింలు అందరు ఒకరికొకరు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో జమ్మా మసీద్ అధ్యక్షుడు ఎమ్డీ. వలిబాబా, ఎమ్డీ. ఖలీల్, సిరాజ్, రహీంతో పాటు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు పాల్గొన్నారు.

● మంగపేట : మండలంలోని పలు గ్రామాల్లో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లింలు సోదరులు సోమవారం ఘనంగా బక్రీద్ పుండుగను ఘనంగా జరుపుకున్నారు. మజీద్‌లు, ఈద్గాల వద్ద నమాజ్‌లు చేసి అల్లాను మనుసారా కోరుకున్నారు. మండలంలోని కమలాపురం, మంగపేట, కోమటిపల్లి, తిమ్మంపేట, బుచ్చంపేట, మల్లూరు, రాజుపేట, దోమేడ, అకినేపల్లి -మల్లా రం గ్రామాల్లో ప్రార్థనలు చేశారు.

● తాడ్వాయి : మండలవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహిం చుకున్నారు. మండలంలోని కాటాపూర్, బీరెల్లి, తాడ్వాయి, నార్లాపూర్, బొల్లెపల్లి, తదితర గ్రామాల్లోని ముస్లింలు ఉదయమే సమీపంలోని మసీదుల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తాడ్వాయిలో జరిగిన వేడుకల్లో ముస్లిం పెద్దలు రియాజ్, షఫిక్, సుజావుద్దీన్, హలీం, సద్దాంహుస్సేన్, షరీఫ్, రాజమహమ్మద్, అక్బర్, రఫీక్, ఆయూబ్, అఫ్రోజ్, కాటాపూర్‌లో రెహమాన్, అక్బర్, రఫీ, అయూబ్, రియాజ్, షరీఫ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపూర్(రామప్ప) : మండలవ్యాప్తంగా ముస్లింలు బక్రీద్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంతోపాటు లక్ష్మీదేవిపేట, నల్లగుంట, ఎల్లారెడ్డిపల్లి, నర్సాపూర్, కేశవాపూర్, తదితర గ్రామాల్లోని ముస్లింలు సమీపంలోని మసీదుల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం హిందూ ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈవేడుకల్లో ముస్లిం పెద్దలు మహ్మద్ అంకూస్, సలీం, ఎమ్డీ.హస్మత్, కరీం, జాకీర్, ఖాజా, అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు : మండలంలో బక్రీద్ పండును ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు పేరూరులలో ఉన్న మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరిని ఒకరూ ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలను తెలియజేసుకున్నారు.

● వెంకటాపురం(నూగూరు) : మండలంలోని ముస్లింలు సోమవారం బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో ముస్లింలు నమాజ్ నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, ముస్లిం పెద్దలు తాజొద్దీన్ పాల్గొన్నారు.

● చిట్యాల : మండల వ్యాప్తంగా బక్రీద్ వేడుకలను ముస్లింలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చిట్యాల, చల్లగరిగె, నైన్‌పాక, ఒడితెల, గిద్దెముత్తారం మజీదు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండల కో ఆప్షన్ సభ్యు డు ఎండీ రాజ్‌మహ్మద్, రబ్బానీ, అజ్మత్‌మియా, హైదర్‌పాష, షఫీ, అక్బర్. షేక్‌హుస్సేన్, షంషుద్దీన్‌పాల్గొన్నారు.

● గణపురం : బక్రీద్ పండుగను పురస్కరించుకుని మండలంలోని చెల్పూరు మసీదులో జరిగిన బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ముస్లిం సోదరులను అలయ్ బలయ్ చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

●మహదేవపూర్, జూన్ 17: మండలంలోని వివిధ గ్రామాల్లో మస్లీంలు సోమవారం బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మసీదుల్లో, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పేదలకు దాన ధర్మాలు చేశారు.

● మల్హర్ : మండల కేంద్రమైన తాడిచర్ల, కొయ్యూర్‌తో పాటు పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

● కాటారం : మండలంలో బక్రీద్(ఈద్-ఉల్ అదా)పండుగ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కాటారం, గారెపల్లి, ఇబ్రహీంపల్లి, అంకుసాపూర్, గంగారం, విలాసాగర్, చింతకాని, దేవరాంపల్లి, గూడూరు, దామెరకుంట తదితర గ్రామాలకు చెందిన ముస్లింలు బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు తోట జనార్దన్, ర వీందర్‌రావు, బాసాని రవి, కాటారం మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీలనాయకులు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో మండల కో-ఆప్షన్ సభ్యుడు అజీజ్, మాజీ సర్పంచ్ ఫిరోజ్‌ఖాన్, మసీద్ కమిటీల ప్రతినిధులు అమీర్, చోటేమియా, దాదామియా, బాజీ, ఖాలిక్, అలీం, గోరెమియా, బాబుజాని, మస్తాన్, మంజూర్, మసూద్, చాంద్, హరుణ్‌ఖాన్, ఇంతియాజ్ పాల్గొన్నారు.


తాడ్వాయి కాటాపూర్ మసీదు ఆవరణలో ముస్లింలు


ములుగులో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న అశోక్


పేరూరులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

నేడు డయల్ యువర్ డీఎం

ములుగు కలెక్టరేట్, జూన్ 17: టీజీఎస్‌ఆర్టీసీ వరంగల్-2 డిపో ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10నుంచి 11గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ జి.సురేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండ నుంచి ములుగు, పస్రా, ఏటూరు నాగారం, మంగపేట రూట్లలో తిరిగే బస్సులకు సంబంధించి ఆత్మకూరు, ములు గు, గోవిందరావుపేట, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట మండల ప్రయా ణికులు, ప్రజలు వారి సూచనలను 9959226048కు తెలియజేయాలని ఆయన కోరారు.

జయశంకర్ ఫౌండేషన్ అధ్యక్షుడిగా రాజ్‌కుమార్

మల్హర్, జూన్ 17 : ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన గుగ్గిళ్ల రాజ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు ఫౌండేషన్ ఛైర్మన్ అయిలి మారుతి ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్‌కుమార్ సేవలను గుర్తించి రాజ్‌కుమార్‌ను మండల అధ్యక్షుడిగా నియమించినట్లు ఫౌండేషన్ ఛైర్మన్ తెలిపారు.

కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలి

కాకతీయఖని, జూన్ 17: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని, బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని విరమించుకోవాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం(టీఎస్‌యూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాకులను వేలవేసే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, వేలం వేయడాన్ని ఆపక పోతే కార్మిక సంఘాలన్నీ ఏకమై సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

మహదేవపూర్, జూన్ 17: మండలంలోని కాళేశ్వరం గోదావరినదిలో ఆదివారం గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం ఉదయం లభ్యమైంది. వరంగల్‌కు చెందిన గరికపాటి అఖిల్ (19) కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం ఈతగాళ్లు గోదావరిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు ఎస్సై భవానీసేన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

కొత్తపల్లి గోరి, జూన్ 17; కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో ఘనంగా పెద్దమ్మ తల్లి వార్షికోత్సవం నిర్వహించారు. గ్రామంలో సోమవారం ఆనవాయితీ ప్రకారం సాదు మల్లయ్య ఇంటి నుంచి పొలిమెర కట్టుట కార్యక్రమం ప్రారంభించారు. అలాగె రేపు గ్రామంలో అమ్మవార్లకు బోనాలు సమర్పించనున్నట్లు ముదిరాజ్ కులస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గణపురం, జూన్ 17: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు అయిన ఘటన పరకాల-భూపాలపల్లి జాతీయ రహదారి గణపురం మండలం చెల్పూరు కేటీపీపీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి మండలం కమలాపూర్‌కు చెందిన శ్రీనివాస్ కేటీపీపీలో ఆర్టిజన్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం డ్యూటీ వస్తున్న క్రమంలో కొంపల్లికి వెళ్లే మూలమలుపు వద్ద తన ద్విచక్ర వాహనాన్ని తిప్పుతున్న క్రమంలో కొంపల్లి వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఒక్కసారిగా ఢీ కొట్టింది. ఈ క్రమంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనివాస్‌ను భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ


బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాస్

ఏటూరునాగారం, జూన్ 17: ఏటూరునాగారం నూతన సీఐగా అనుముల శ్రీనివాస్ సోమవారం ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలను స్వీకరించారు. గత రెండు రోజుల క్రితం మల్టీ జోన్ సీఐల బదిలీల్లో భాగంగా గతంలో ఏటూరునాగారం సీఐగా పని చేసిన మండల రాజును హైదరాబాద్ మల్టీ జోన్- 1 పరిధిలోని ఐజీపీ వోవో రిపోర్ట్‌గా రాజును బదిలీ చేశారు. కాగా, ఆయన స్థానంలో ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీసీఎస్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అనుముల శ్రీనివాస్‌ను ఏటూరునాగారం నూతన సీఐగా నియమిస్తూ మల్టీ జోనల్ ఐజీ ఏ.వీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం సీఐగా బాధ్యతలు చేపట్టారు. దీంతో బాధ్యతలు స్వీకరించిన సీఐ శ్రీనివాస్‌ను పలువురు ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ములుగు ఎస్సైగా వెంకటేశ్వరరావు


వెంకటేశ్వర్‌రావు

ములుగు, జూన్ 17: ములుగు పోలీస్‌స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా(ఎస్‌హెచ్‌వో) సీహెచ్.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వాజేడు ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ములుగుకు బదిలీ చేసింది.

వాజేడు ఎస్సైగా హరీష్ బాధ్యతలు


హరీష్

వాజేడు, జూన్ 17: వాజేడు ఎస్సైగా రుద్రారపు హరీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీలలో ఇప్పటి వరకు ఎస్సైగా ఉన్న సిహెచ్ వెంకటేశ్వరరావును ములుగు స్టేషన్‌కు బదిలీ చేయగా వీఆర్‌లో ఉన్న హరీష్‌ను వాజేడుకు బదిలీ చేశారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో పేరూరు ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయనకు వాజేడుపై పూర్తి పట్టుంది.

వెంకటాపురం రామప్ప ఎస్సైగా సతీష్


సతీష్

వెంకటాపూర్(రామప్ప), జూన్ 17: వెంకటాపూర్ నూతన ఎస్సైగా జక్కుల సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన చల్ల రాజు బదిలీపై ములుగు జిల్లాకేంద్రానికి వెళ్లారు. కాగా, కొడిశాల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న జక్కుల సతీష్‌కు వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ కేటాయించగా ఆయన పూర్తి బాధ్యతలు తీసుకున్నారు.

సబ్‌స్టేషన్‌లో విద్యుత్ ప్రజావాణి

వెంకటాపురం(నూగూరు), జూన్ 17: మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం విద్యుత్ ప్రజావాణి జరిగింది. ఈ సందర్భంగా అధికారు లు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. విద్యుత్‌శాఖ ఏఈ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి నైపుణ్యాలపై అవగాహన

వెంకటాపురం(నూగూరు), జూన్ 17: మండలంలోని గొల్లగూడెం గ్రామంలో సోమవారం కాఫేడ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి నైపుణ్యాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సంస్థ మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు మాట్లాడారు. ఈ సదస్సులో కాఫేడ్ స్వచ్ఛందసంస్థ వాజేడు కోఆర్డినేటర్ కామేష్, సభ్యులు ఉషారాణి, ఇందిర, పద్మ, నరేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మల్హర్, జూన్ 17 : విద్యుదాఘాతంతో యువకుడి మృతి చెందిన సంఘటన మండలంలోని రుద్రారంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. కొయ్యూర్ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దుద్దిళ్ల నిశాంత్(30) ఇంటి ఆవరణంలోని మోటారు వైరును సరి చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిశాంత్‌ను భూపాలపల్లిలోని హస్పిటల్‌కు చరలించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. నిశాంత్‌కు గత నాల్గు నెలల క్రితమే సృజనతో వివాహం అయ్యింది. మృతుడి భార్య సృజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యూర్ పోలీసులు తెలిపారు. నిశాంత్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

చదువుల తల్లికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న సీఆర్‌పీఎఫ్, పోలీసులు

కన్నాయిగూడెం, జూన్ 17: మండలంలోని ఏటూరు గ్రామ పంచాయితీ పరిధి లోని సింగారానికిచెందిన ఆలెం శ్వేతపై చదువులో రాణిస్తోంది. కుటుంబ పరిస్థితులు సహకరించకున్నా ప్రతిష్టాత్మక ఎన్ ఐటీలో ఇంటిగ్రేటెట్ కోర్స్ (బీఎస్సీ , బీఎడ్) కు ఎంపికయింది. ఆమె కుటుంబ పరిస్థితి చూసిన మండల పోలీసులు చేయూతనిచ్చారు. ఎస్సై ఎం.సురేష్ 5వేలు, సీఆర్పీఎఫ్ సిబ్బంది 15వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా నిరుపేద విద్యార్థినికి చేయూతనిచ్చి న పోలీసులను పలువులు గ్రామస్థులు అభినందించారు.

ముందస్తు సాగుకు రైతుల నిర్ణయం

గణపురం, జూన్ 17: గణపసముద్రం శివారు రైతులు వరి పంట నాటేందుకు సన్నద్ధమయ్యారు. సోమవారం ఆయకట్టు శివారు రైతులు మండల కేంద్రంలోని రైతు వేదికలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఈ సారి జులై వరికల్లా గణపసముద్రం శివారులో వరి నాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రతి రైతు 140రోజులలోపు మాత్రమే చేతికచ్చే వరి నాట్లను నాటాలన్నారు. గణపసముద్రం నుంచి పంటలకు నీరందించే కోటకాల్వ, ఊటకాల్వ, మత్తడి కాల్వలు మరమ్మత్తులు ఉన్నందున నవంబరు చివరికల్లా పంటలు చేతికస్తే డిసెంబరులో కాల్వల మరమ్మత్తులు పూర్తవుతాయని దీని ద్వారా యాసంగి సాగుకు కూడా ఆలస్యమవ్వదని నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రైతులంతా దుక్కులు సిద్ధం చేసుకోవాలని నిర్ణయించారు. అనంతరం రైతులంతా కలిసి కాల్వల ద్వారా గణపసముద్రం నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాబురావు, ఎంపీటీసీ శివశంకర్, రైతులు సురేష్, తిరుపతి, స్వామి, ప్రశాంత్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మధు, అశోక్, రాజు, భద్రయ్య, సారంగపాణి తదితరులు ఉన్నారు.

సమాచారం మాకు.. బహుమతి మీకు

మావోయిస్టుల ఫెక్సీలు ఏర్పాటు చేసిన పోలీసులు


గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన వాంటెడ్ మావోయిస్టుల ఫ్లెక్సీ

మహదేవపూర్ రూరల్, జూన్ 17 : వాంటెడ్ లిస్టులో ఉన్న మావోయిస్టుల ఫోటోలతో కూడిన ఫ్లెక్సీలను పోలీసులు పలు గ్రామాల కూడళ్లలో సోమ వారం ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలో ఉన్న మావోయిస్టుల సమాచారం మాకు అందిస్తే బహుమతి మీకిస్తామంటూ అందులో పేర్కొన్నారు. సూరారం, అంబట్‌పల్లి, పెద్దంపేట గ్రామాల్లో ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో ఈఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

కార్యకర్తలు పార్టీని బలోపేతం చేయాలి

యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య

మంగపేట, జూన్, 17: కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క కుమారుడు ధనసరి సూర్య పిలుపునిచ్చారు. మండలంలోని కమలా పురం, గంపోనిగూడెం, మంగపేట, బోరునర్సాపురం, మల్లూరు, కొత్తమ ల్లూరు, చుంచుపల్లి, పాలాయి గూడెం, వాడగూడెం, రమణక్క పేట, రాజుపేట తదితర గ్రామాల్లో సోమవారం కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించి కార్యకర్తల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సీతక్క ఆశయాలను, పట్టుదలకు అనుగుణంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి, మంగపేట సహకార సంఘం డైరెక్టర్ కోడం బాలకృష్ణ, సీతక్క యువసేన మండల అధ్యక్షుడు సిద్దాబత్తుల జగదీశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు చిట్యాల బాలకృష్ణ, పయ్యావుల బాబురావు, పత్రి రాజు, ఇప్ప సమ్మయ్య, కోవెల రామ్మోహన్, నాగమూర్తి రాజశేఖర్, ప్రశాంత్, చంటి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

బయ్యారం, జూన్ 17 : ఈ నెల 26న మానుకోట జిల్లా కేంద్రంలో జరిగే ఏఐకేఎంఎస్ జిల్లా జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు భిక్షం పిలుపునిచ్చారు. బయ్యారంలో జిల్లా జనరల్ కౌన్సిల్‌కు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణగా కీర్తించబడే దేశంలో రైతు అడుగడుగునా అవమానాలకు గురవుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలు కొనే దగ్గర నుండి పంటను విక్రయించే వరకు రైతు దగా చేయబడుతున్నాడని ఆవేదన చెందారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, సంగన్న, ఐలయ్య, బుచ్చయ్య, రాకేష్, నాగేశ్వరరావు, విశ్వనాథం, మహేష్, శేషు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


ప్రసాద్(ఫైల్)

వాజేడు, జూన్ 17: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వాజేడు ఎస్సై రుద్రారపు హరీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చెరుకూరుకు చెందిన పూనెం ప్రసాద్(45) అదే జీపీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలు శ్రీదేవి, అనూషలు ఉన్నారు. మొదటి భార్య శ్రీదేవితో మనస్పర్థలు రావటంతో సుమారు పదేళ్ల క్రితం వాజేడుకు చెందిన అనూష అనే ఆమెను వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో కొంత కాలంగా ట్రాక్టరు నడుపుతూ మద్యా నికి బానిసైయ్యడు. నిత్యం ఇంటికి ఆలస్యంగా రావడమే కాకుండా అనూషతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో అనూష మద్యం తాగవద్దని పలుమార్లు చెప్పినప్పటికి ప్రసాద్‌లో మార్పు రాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సైతం మద్యం తాగి వచ్చిన ప్రసాద్‌తో అనూష గొడవ పడింది. దీంతో మనస్తాపం చెందిన ప్రసాద్ గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు ప్రసాద్‌ను వాజేడు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి మొదటి భార్య కొడుకు హేమంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయటం జరిగిందని ఎస్సై తెలిపారు. మొదటి భార్యకు ఇద్దరు సంతానం కాగా ఇద్దరి వివాహాలు జరిగాయి. రెండో భార్య అనూషకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు.

ముంపు ప్రాంతాల పరిరక్షణ కోసం పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు రవికుమార్

ఏటూరునాగారం, జూన్ 17: ములుగు జిల్లాలోని ముంపు ప్రాంతాల పరిరక్షణ కోసం సీపీఎం పోరాటాలు ముమ్మరం చేయాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బందారి రవి కుమార్, సూడి కృష్ణారెడ్డిలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆకులవారి ఘణపురంలో ఆ పార్టీ జిల్లా సభ్యుడు ఎమ్డీ. దావూద్ అధ్యక్షతన ములుగు జిల్లా స్థాయి నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రవి కుమార్, కృష్ణారెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వం ములుగు జిల్లాలోని ముంపు ప్రాంతాల పరిరక్షణకై ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని, కాగా తమ పార్టీ పోరాటాలను ముమ్మరం చేయనున్నట్లు వారు తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్నందున్న మండలంలోని కొండాయి, రామన్నగూడెం, రాంనగర్, కొయగూడా ఎల్లాపురం, ఏటూరునాగారంలోని ఓడగూడెంతో పాటు తదితర ప్రాంతాలను గోదావరి వరద ముంపు ప్రాంతాలుగా గుర్తించి ఆ ప్రాంత ప్రజలకు ప్రాణ నష్టం జరగకుండా తగు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. తునికాకు కూలీలకు బోనస్ చెల్లించాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గత ప్రభుత్వంలో పేరుకుపోయిన గిరిజనుల అనేక సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు బీరెడ్డి సాంబశివ, జిల్లా నాయకులు రత్నం రాజేందర్, కొప్పుల రఘుపతి, పోదెళ్ల చిట్టిబాబు, కుమ్మరి శ్రీను, గఫూర్ పాషా, జాగటి చిన్న, గొంది రాజేష్ పాల్గొన్నారు.